నిర్బంధంలో సమ్మె

కార్మిక

ఉదయం ఐదున్నర....... సైరన్ కూత వినిపిస్తోంది. ఆకూత రోజటిలా వేలాదిమంది రక్తమాంసాలు భక్షించటానికి సిద్ధంగాఉన్న బకాసురుని విజయ గర్వపు అరుపులాలేదు. భీముని చేత కోరలు పీకబడి కొరిప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న ఆక్రందనలా ఉంది. ఆ కొరిప్రాణాన్ని కాపాడటానికా అన్నట్లు 20 మంది సాయుధ భటులు కాపలా కాస్తున్నారు.

ఎప్పటిలాగా బావి మీద... అరచేతిలో ప్రాణం పెట్టుకొని ఎన్నో అపాయాలను దాటి బ్రతుకు జీవుడా అని ఇవ్వాళటికి ఈ గండాలన్ని తప్పినవనే సంతృప్తితో బావుల నుండి బయటికివస్తున్న కార్మికులు లేరు. తను చేయబోయే కష్టాన్ని తలచుకుంటూ మరువలేని ఘోరాతి ఘోరమైన ప్రమాద సంఘటనలు జ్ఞప్తికి రాగానే గగుర్పాటుతో ఒళ్ళువణుకుతుంటె పెండ్లాం పిల్లలను తలుచుకుంటు కొండంత భారంతో నడుస్తూ....

అనకుండా పొరుగూళ్ళ జనం వస్తున్నారు ఆ బహిరంగసభకి. జనసమూహం మధ్య లోంచి.... సన్నగా దారి కన్పిస్తోంది 'పాపిడ'లా, ఆదారిలోంచే బండి వెళ్ళాలి. తలు. కుంటుంటె ఆపాట వింటుంటె ప్రతాపరావు దొర దవడలు బిగుసుకుపోతున్నయ్. జన సమూహం మధ్యలోంచి ఎఱ్ఱని జండా రెపరెపలాడ్తోంది. ఎవరో వీపుకి కోతలు పెట్టి కారం అద్దినట్టు ఇదైపోతున్నాడు. బండి అలాగే నిలబడిఉంది. దొరగారి మనసులో కొద్దిగా అనుమానం. కొద్ది దూరంలోఉన్న తాటిచెట్లలోంచి కావడి బుజాన వేసుకుని వస్తున్నాడొక గౌడు. బండి దగ్గరికి రానేవచ్చాడు.

"ఏంరా గౌడు! అక్కడజరిగేది ఏం మీటింగు?" అంటూప్రశ్నించాడు.

"సంఘపోళ్లది"అంటూ వెళ్ళిపోయాడుగౌడు. దొరగారు దారికిఇరువైపుల చూశాడు, పక్కదారులు కన్పించలేదు– అంతటా పచ్చనివరిపొలాలె. బండెనుక మనిషితో, మీటింగుమధ్యలోంచిపోతె?" తల అడ్డంగాఊపుతున్నాడు– ఓమారు ఓదెల్ను, ఓమారు జనసమూహాన్ని రెపరెపలాడె ఎఱ్ఱజండానిచూసి నిట్టూర్చాడు.

"అరేయ్ ఎనుకబండెక్కు తొందరగపోవాలె" అన్నాడు ఓదెలు నమ్మలేనట్టు చూశాడు,

"ఎక్కరాగాడిదీ– ఎక్కు, ఎక్కంటె చెవులు ఇనపడ్తలేవ్!" కోపంగా అన్నాడుదొర.

భయంగా బండెక్కి వెనుక ఒదిగికూర్చున్నాడు ఓదెలు. కోపంగాఉన్న ప్రతాపరావుదొర. రెండుగిత్తల్ని రెండుదెబ్బలు కసిగాకొట్టాడు. బండిమళ్ళీ 'సవారీ' మొదలెట్టింది.

బాయి దొర యాదికిరాగానే, ఐదునిమిషాలు ఆలస్యమైందని నాగపెడ్తాడన్న భయంతో అదర బాదరగా డ్యూటీకి వస్తున్న కార్మికులూ లేరు. దొరలు (మేనేజర్లు, అండర్ మేనేజర్లు, ఓవర్‌మెన్‌లు) కార్మికులను ఏదో నెపంతో తిట్టేటి తిట్లూలేవు. దొరలూ లేరు దొరల జులుంలేదు దొరల జులుంను కాపాడడానికి ఎత్తులువేసే సక్కజిత్తుల ట్రేడ్‌యూనియన్ నాయకులూ లేరు. అలర్ల చప్పుడూలేదు, యంత్రాల రొదా లేదు.

బావి పీద ఎటు చూసినా అల్లంత దూరం వరకు ఉండే గుట్టల్లాంటి బొగ్గు కుప్పలు లేవు. బుల్‌డోజర్‌తో ఊడ్చుకపోయి ఆనేలంతా జగిలి చేసినట్లుగా నున్నగా ఉంది. బొగ్గును తీసుకపోయే లారీల బుయ్ బుయ్ శబ్దం లేదు. రకరకాల యంత్రాల రణగొణధ్వనుల్లేవు. కార్మికుల అరపులు లేవు, దొరల కేకలులేవు. మొత్తం ఉప్పెన వచ్చి ఊడ్చుక పోయినట్లుగా శ్మశానంలా ఉంది. శ్మశానంలోని కాటికాపరుల్లాగా వాచ్‌మెన్లు మాత్రం అక్కడ తిరుగుతున్నారు.

సైరన్ కూత వినీవిననట్లు నిర్లిప్తంగా ఉన్నాయి కార్మికవాడలన్నీ. ఉదయమే ఊరంత కాల్తున్నట్లు బొగ్గుపొయ్యిల నుండి వెలువడే పొగలేదు. కార్మిక స్త్రీలందరు అప్పుడే ఒక్కొక్కరు లేచి ఏదో తెలియని బాధతో మనస్సు భారంగా ఇంటిపనులకు ఉపక్రమిస్తున్నారు. ట్రేడ్‌యూనియన్ నాయకుల కుట్రలచే తమ శక్తి ఏమిటో తెలుసుకోలేక పోయిన కార్మికులు అనివార్యంగా పద్మవ్యూహంలోకి పోయిన అభిమన్యునిలా ఎన్నో అర్థంకాని సమస్యలతో నిద్రపట్టక మగత నిద్రనుండి లేచి ఒక్కొక్కరే బయటికివస్తున్నారు.

తూర్పున సూర్యుడు ఉదయించాడు. కాలిపోతున్నకొద్దీ మరింత బొగ్గునుచేర్చుతే చిటపటకాలుతూ ఇంజనును ఉరికించే రైలు ఇంజనులోని ఎర్రగా మండే మంటలా లేడు. బొగ్గుఒడిసిపోయి ఉన్నవేడితో కుంటుకుంటూ నడుస్తున్న రైలు ఇంజనులోని బూడిదకాబోతున్న అగ్నిలా కాంతి విహీనంగా ఉన్నాడు. బయటికి వచ్చిన కార్మికులకు బస్తీలోని పాన్‌షేలాకు అంటించిన ఎర్రటి అక్షరాల కాగితం కొట్టొచ్చినట్లుగా అందరి దృష్టిలో పడ్డది.

"నాల్గురోజుల కోసారి అంటేత్తాండ్లు రాడికలోల్లయో కదా? ఏమి రాసింద్లో చదువుదువు పా" నోట్లోవున్న పండ్లపుల్లను చేతిలబట్టుకోని వెంకటయ్యను అడిగింది రాములు.

848

"వాల్లుగాకపోతే కార్మికుల కోసం కాగితాలు ఇంకెవ్వడేత్తడే?" వాలిపోస్టర్ను చదవకముందే కచ్చితంగా చెప్పిండు వెంకటయ్య

"వాళ్లేఏత్తరని నాకెఱకేగని సదువుతువు పోరాదు; రాములు, నారాయణ కలిసి చేలకాడికిపోయేసరికి ఇంకొందరు జమయిండ్లు అక్కడ.

☆ "రామకిష్టాపురం 1వ ఇంక్లయిన్ బావివద్ద కార్మికులపై పోలీసుల లాఠీ చార్జీని ఖండించండి।

☆ అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలి।" అని కార్మికుడొగడు గట్టిగా చదివిండు.

"వీనవ్వ మా బాయికాడ ఎప్పుడు కాగితాలు అంటించినా గూడ గాద్దికొడుకులు పీకేపిత్తాండ్లు. అయినా వీళ్లను ఎక్కడ కనిపించినా పోలీసోల్లు పట్టుకపోతాండ్లు కదా ? మరి ఇవ్వెప్పుడంటింతాండ్లో ?" ఆశ్చర్యపోతూ అడిగిండు ఆశాలు.

"ఆదరాక పందిరి కురుసున్నదన్నట్లు మంది గురించి పాటుపడుదామనేటోల్లకు మార్గమేకరువా ? అయినా నాకు తెలువ కదుగతా, అందరు గట్టిగనే మాట్లాడుతె, అందరం కట్టుగనేవుంటే ఎందర్నని పట్టుకపోతరు?" వెంకటయ్య ఇంకేదో చెప్పబోదామనుకునేటాల్లకు కలిగించుకొని.

"ఏం మాట్లాడుదోఏమో ? ఎవడు గట్టిగమాట్లాడుతె వాన్నే రాడికల్ అనబట్రి, రాత్రికిరాత్రే పట్టుకపోబట్రి. ఇగ ముంగటబడి ఎవడు మాట్లాడుతడు. గా కొత్త గూడెం కుమారయ్య సారేమో ఈ చట్టం సమ్మెచేస్తెపోదు, మేం కోర్టులో కేసుపెడుతున్నాం మీరు పనులల్లకు దిగిపోండని అనబట్టె, మనకేమో ఏది తెలువనాయె, మనం ఎవన్నిబట్టుకోని నడుచుడేనారన్నా:" అడిగిండు 35 ఏండ్ల చెంద్రియ్య.

"ఏమోరా కుమారయ్య సారేమో గట్లంటడు, గా రాడికలోల్లు మొన్నటిదాకా బాయిలమీదికచ్చి మనం గట్టిగుండాలె, మనం తప్పకుండగెలుస్తాం, ఈ చట్టం ఉంటె ఇక నుండి మనం సమ్మెచేయలేం, మన హక్కులు రావాలంటె సమ్మెగదా మన ఆయుధం అని చెప్పిరి ఇప్పుడు పోలీసోల్లు వాల్ల గురించి తిరుగుతాంటె వాల్లెటుబోయిండ్లో ఏమో;" ఈ ట్రేడ్‌యూనియనోల్ల, రాడికలోల్ల రాజకీయాలు అర్థంకాక అన్నడు బక్కయ్య.

"నీయవ్వ....రాడికలోల్లని మెడలేమన్న బోర్డుగట్టి ఉంటానాదిర? ఉన్నదున్నట్లు ఎవడడిగినా రాడికలేనాయె, న్యాయం గురించి మాట్లాడినోడల్లా నక్సలైటేనాయె, ఎవడో ఏమో అంటడని అందరం నోరుమూసుకోనే ఉందామా ? ఎవలు గూడ బాయిలకాడ కనిపిత్తలేరంటె ఏమి గనపడమన్నవ్ నువ్వే అనబడ్తివి బాయిల మీదికి వస్తానేపట్టుక

849

పోతాండ్లని గా నిన్నటి సంగతే సూఛ్రిదు.... యూనియనోల్లు పోలీసుల పెట్టుకోని రామకిృష్ణాపురం వన్ యింక్లయిన్ బాయిని నడిపించడానికి ఏషంగట్టిరి. గా సంగతి తెలిసి మిగితా బాయిలోల్లందరు అక్కడి కచ్చేటాల్లకేముంది వీన్ని వాన్ని అనకుండ పోలీసోల్లు కట్టెలుబట్టి ఇట్టంవచ్చినట్లు కొట్టిరి. మందమరిృ బాయిలు నడుత్తావయని రామకిృష్ణపురమోల్లకు జెప్పిరి, అక్కడి బాయిలు నడుత్తానయని ఇక్కడి బాయిలోల్లకు చెప్పవట్టిరి లీడర్లు. ఇగ ఎవల్ని నమ్మాల్నో తెలుత్తలేదా।" వెంకటయ్య చెప్పే మాటలకు అడ్డం ఎవడూ ఏమిమాట్లాడక ఎవరికి తోచినట్లు వాల్లు యూనియనోల్లను, పోలీసోల్లను తిడుతాండ్లు.

"మరి ఇట్ల ఇంకెన్నిరోజులే మనం సమ్మెచేసేది ఇప్పటికే 45 రోజులు గాబట్టె" అర్థంగాక అడిగిండు రాములు.

"నీయవ్వ ఏదైనామంచిదే అటోఇటో తేలేదాక గట్టిగుండాలె" 50 ఏండ్ల కొమురయ్య తన 20 ఏండ్లసర్వీసులో తేలిననిర్ణయంగా అన్నాడు.

"మొన్నటినుండి గోదావరిఖనిలోగూడ అన్నిబాయిలోల్లు సమ్మెచేత్తాండ్లట గదా!" అడిగిండు ఓకార్మికుడు.

"అవును అక్కడగూడ మనకు మద్దతుగా ఈ నష్టంపోవాలని సమ్మెచేత్తాండ్లు" వేరేకార్మికుని జవాబు.

"నీయవ్వ.... గింతమందిమి చేయబడితిమి ఇంక ఎటుతేలుతలేదు, ఇది దేల్తదా? తేలదా? ఇప్పటికే అప్పులపాలయినం."

ఇలాసాగుతాంది చర్చంతా........

ఇంతలో ఎవరోయువకుడు చేతిలో పేపరుపట్టుకొని: తనగాండీవంతో ఈ కాలగమనాన్నే ఆపేశక్తిగల అర్జునునిలా విజయగర్వంతో దారిలోకనబడ్డ ప్రతి వాల్లకు ఏదోచెప్పుకుంట వస్తున్నాడు.

దూరంలోఉండగానే.... "ఏమన్నరాసిండ్లారా మనగురించి" అని అడిగిండు వెంకటయ్య.

"ఆఁరాసిండ్లు"

దగ్గరకువచ్చి పేపరువిప్పి "సింగరేణి కార్మికుల సమ్మెవల్ల 222 రైళ్ళురద్దు" "ఇదీ తీవ్రవాదులచిచ్చు" అని తాటికాయంత అక్షరాలను గడగడచదివిండు.

"అబ్బా గన్నిరైళ్ళు ఆగిపోయినవా" తనబలాన్నితానే నమ్మలేనిమల్లన్న ఆశ్చర్యంగా అన్నాడు. అందరిముఖాల్లో ఏదో తెలియనిఆనందం, సంతృప్తి.

850

"ఇంకేందిరాసింద్లురా" యుద్ధంలో గెలిసివచ్చినవాండ్లను అడిగినట్లుగా అడిగిండు రామన్న.

తిరిగి ఆ యువకుడు చదవడం మొదలుపెట్టిండు. అందరు ఏదో కొత్తవిష యాలు తెలుసుకుంటున్నట్లుగా ఉత్సాహంగా, ఆశ్చర్యంగా ,వింతగావింటుండ్లు- "ఇంకా కొద్దిరోజులలో 300 రైళ్ళు రద్దుఅయ్యే అవకాశాలు ఉన్నాయి. అనేక ఫాక్టరీలు మూతపడేటట్లున్నాయి. ఇప్పటికే పవర్ స్టేషనులు సగం ఆగిపోయినవి" మొసవచ్చినట్టుంది. ఆగాడు....

మళ్లీ మొదలుపెట్టిండు "ఇది తీవ్రవాదులచర్య - రాడికల్స్ లేనివిపోనివి కల్పించి కార్మికులను అనవసరంగా రెచ్చగొట్టి సమ్మెలోదించారు- అంతేగాని కార్మికులకు ఏమి సమస్యలులేవు- సమ్మెచేస్తున్న కార్మికుల సమస్యలేమిటో వారి ప్రతినిధులు ఎవరో నాకేమితెలియదంటూ ముఖ్యమంత్రి అన్నారు."

"ఏందేంది మనకేమి సమస్యల్లేవా?" అని ఎవరో అనడంతో చదువడంఆపి ...

"ఆఁ అప్పనే మనకేమి సమస్యలులేవట, ఇంకేమంటదో తెలుసా అసలు మస్టర్ల కోత చట్టమేలేదు రాడికల్స్ రెచ్చగొట్టుతెనే సమ్మెచేస్తానసుట" అన్నాడు పేపర్ యువకుడు.

"నీయవ్వ ఇదంతా మనలమోసంచెయ్యాలని చూస్తాండ్లు- వాడు యూనియ నోడేమో ఈ చట్టమేవోడు అంటడు- ముఖ్యమంత్రిమో అసలు మస్టర్లకోతపెట్టుట లేదంటడు. ఇక్కడ మేనేజిమెంటోడేమో జీతాలుకొయ్యబట్టె ఇవన్ని లఫంగి వేశాలున్నట్లున్నయి" కోపాన్ని వెల్లబోసింది సుధాకర్.

"ఇగో ఇంకోటినుండ్లి"; చదువడం మొదలు పెట్టిండు పేపర్ యువకుడు.

"ఉన్నరైల్లు, ఫ్యాక్టరీలు నడవడానికి ప్రభుత్వం కలకత్తా నుండి 10 లక్షల టన్నుల బొగ్గుకొనుగోలు చేసింది. అయితే బొగ్గుతేవలసిన ఓడ విశాఖపట్నం రేవులో దిగాల్సివుండగా కొలంబోకు పోయింది. ఆ ఓడ కొలంబోకు ఎట్లాపోయిందో తెలి యదు. దాని గురించి తెలుసుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" చదువడం ఆపిండు.

"ఇది కూడ రాడికలోల్లే ఎత్తుకపోయిండ్లనలేదు నయ్యం"; అన్నడు వెంకటయ్య

"అంటే అంటరు గూడ ఈ దగుల్బాజి నాకొడుకులు నోట్లె ఉన్నది నాలుకయితె గదా !" కసిగా అన్నాడు ఇంకో కార్మికుడు.

851

పరిస్థితి అంతా యుద్ధంలో గెలుస్తున్న పక్షంవాళ్ల ఎన్ని ప్రాణాలు పోగొట్టుకున్నా, ఎన్ని నష్టాలకు గురైనా గెలుస్తున్నయన్న ఉత్సాహంలో మాట్లాడుకుంటున్నట్లుగా ఉంది.

పొద్దు బారెడెక్కింది. ఒక్కొక్కరు ఇండ్లల్లకు మెల్లమెల్లగా ఎల్లిపోతాండ్లు.

"ఈ రోజు సాయంత్రం 7 గంటలకు మార్కెట్టులో బహిరంగసభ- ఈ సభలో కార్మికుల సమస్యల గురించి మన ఎర్రజెండా యూనియన్ నాయకులు మాట్లాడెదరు" అంటూ తాగిన వాడిలా బొంగురు గొంతుతో ఎవరో మైక్‌లో చెప్పుకుంటపోతాండు.

X X X X

సాయంత్రం ఆరున్నర కావస్తుంది. గుంపులు గుంపులుగా కార్మికులు బహిరంగసభాస్థలానికి చేరుకుంటాండ్లు. అక్కడ ఓ పెద్ద మైదానంలో ఓ బల్ల- ఆబల్ల పైన నిలువుగా మౌత్‌పీస్ అమర్చబడి ఉంది- వచ్చిన కార్మికులు గుంపులు గుంపులుగా జమగూడి మాట్లాడుకుంటాండ్లు- కొంత మంది ఎర్రచొక్కాలు తొడుక్కున్నవారు కర్రలు చేతబట్టుకొని తాగినోనితీర్గ ఊగులూ అందరిని కూర్చోండి, కూర్చోండని మొత్తుకుంటాండ్లు.

ఆ సమయంలో దిద్దిన ఎరుపుతో రెపరెపలాడుతున్న ఎర్రజెండా ముందుపెట్టుకొని ఒక తెల్లనికారు దుమ్మునులేపుతువచ్చి ఆగింది- రేగిన దుమ్మును దులుపుకుంటూ కసిగా సూసిండ్లు కార్మికులు- కారు వెనుకనే రెండు, మూడు వ్యాన్లువచ్చి స్టేజీవద్ద ఒకటి దూరంగా అటొకటి, ఇటొకటి ఆగినవి దాంట్లోంచి సాయుధులైన కాకిబట్టలుకొని ఎరుపును కాపాడడానికి దిగాయి.

మైక్‌లో ఒకతను "కార్మిక సోదరులారా ఇప్పుడు సభ ప్రారంభమవుతుంది. మొదట కామ్రేడ్ కుమారయ్యగారు మాట్లాడుతారు- కా॥ కుమారయ్యగారు ఇప్పుడు ఈ రాడికలోల్లు చేస్తున్న పోరాటంకన్న రెండింతల పోరాటం చేసిండు- తుపాకినే భుజానవేసుకొని ఈ అడవుల్లో తిరిగిండు- నిజాం సర్కారును గడగడ లాడించాడు- అటువంటి కుమారయ్యగారు ఇప్పుడు మీ ముందు మాట్లాడుతాడు."

"మా సచ్చిపోయిన బర్రె పగిలిపోయిన బుడ్డెడు పాలిచ్చిందట": గట్టిసనే అన్నారెవరో గుంపులనుండి- ఆహా... హా....హా.... జనంలో నవ్వులు.

852

మళ్లీ తిరిగి ఆయనే రేషమెచ్చిన వాడిలా "కార్మిక సోదరులారా ఈ సభను చెడగొట్టాలని కొంతమంది దుండగులు ప్రయత్నిస్తున్నారు"

"పచ్చకామెర్లోనికి లోకమంత పచ్చగనే కనపడుతదట" మెల్లెగా అన్నారెవరో వెనుకనుండి

బొంగురుగొంతు నాయకుడు కళ్ళకున్న అద్దాలుతీసి చేతపట్టుకొని హాఁ. హాఁ. అని సవరించుకొని "కార్మికసోదరులారా! మన ఎర్రజెండా యూనియన్ నాయకత్వాన 30 పైసలున్న జీతం 30 రూపాలదాక పెంచుకున్నాం. ఇంకా ఎన్నోహక్కులు సాధించుకున్నాం. మొదటినుంచీ మన యూనియన్ కార్మికులకెంతో సేవచేసుకుంటా వస్తాంది. కాని ఈమధ్య కొంతమంది యూనియన్‌ను దెబ్బగొట్టాలని చూస్తాండ్లు. అందుకే చీటికిమాటికి కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలు చేపిస్తున్నారు. గోరుతో పోయేవాటిని గొడ్డలిదాకా తీసుకపోతున్నారు. కె కె2లో కార్మికులు సమ్మెచేస్తే 8 మస్టర్లు కోతపెట్టింది మేనేజిమెంటు. దాన్ని చర్చించి సాధించుకోవచ్చు. మేం బెల్లంపల్లిలో, గోదావరిఖనిలో ఎన్నోసార్లు సాంధిచాం. కాని కొంతమంది చట్టాలు తెలియనివాల్లు అనవసరంగా కార్మికులను రెచ్చగొట్టి మందమర్రి, రామకృష్ణాపురం, గోదావరిఖని డివిజన్లను మొత్తం బందుపెట్టించారు. మేనేజిమెంటు జీతాలు కోస్తూనే వుంది, మేంచర్చించి సాదించుతనేఉన్నాం. ఇంతదానికి ఇంతపెద్దసమ్మె అనవసరం."

"అయ్యా ఇదేమన్నా బావబామ్మర్దుల సయ్యాటలా వాడుపెట్ట, మీరుతియ్య, లేకుంటె మేంఏమన్న అడుక్కతింటున్నమా?! తాపతాపకు జీతాలుకోస్తంఅని బెదిరిస్తున్నారు" అని ఎవరో లేచిఅడిగిండు.

పాపం గొంతులో వెలక్కాయపడ్డట్టు అయింది నాయకుడికి.

గుటకిల్లుమిర్రింగి సర్దుకొని "కార్మిక సోదరులారా అదే మేంఅంటున్నాం. మేనేజిమెంటుకు జీతాలుకోసే అధికారంలేదు. దానిగురించి మనం పెద్దపోరాటం చేయాల్సివుంది అయితే ఇది ఒక్క మనంచేస్తనేపోదు. దేశంలోఉన్న కార్మికులందరు చేస్తేగాని ఈచట్టంపోదు అందుకని మనం ఓపికపట్టాలి. ఇపుడు పరిస్థితి మంచిగ లేదు కాబట్టి కార్మికులారా! లెనిన్ మహాశయుడు ఏమన్నాదోతెలుసా? "ఒక్కడుగు ముందుకు రెండడుగులు వెనక్కు" వేయమన్నాడు.

"నువ్ ఎప్పుడు చెప్పినా ఒక్కడుగు ముందుకు రెండడుగులు ఎనుకకే ఎయ్య మంటి ఇగ ముందుకు పొయ్యేదెప్పుడు."; అన్నరెవడో గట్టిగ

"ఆహ్హా....హా....హా.... జనంలో నవ్వులు

853

"మీ అందరికి రాడికలోల్లు బాగనూరిపోసారయ్యా మీరంత నక్సల్లు": కోపం వచ్చిన నాయకుడు అక్కసుతో గట్టిగా అన్నడు.

"లేకుంటె నీలెక్క మేనేజిమెంటు బూట్లు....

పూర్తిగాకముందే ఎర్రచొక్కాలవాళ్లు, ఖాకీబట్టలవాళ్లు గల్లపట్టుకున్నారు. "విడవండి" వేలాది గొంతులు ఒక్కసారి పలికాయి. ఎవడిదో గొంతుపొగరుగొంతోడు "మారో మాకెలాదోంకో" మొత్తుకున్నాడు అంతే.... పటపట కర్రలు టపటపరాళ్లు ఉరుకులు.... పరుగులు.... నిమిషంలో నిర్మానుష్యం.

కారు, వ్యాన్లు పోలీస్టేషన్ ముందు ఆగినయి. ఫోన్ మోగింది. ఆరాత్రి జనరల్ మేనేజర్ ఇంటికి పోలీస్స్టేషన్‌కు ఏవో గుసగుసలు సాగాయి.

X X X X

ఉదయం 8 గంటలు కావస్తుంది....

సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ ఆఫీస్ అని పెద్దబోర్డున్న బిల్డింగ్ ముందు ఎర్రజెండాముందున్న తెల్లకారు, మూడురంగులజెండా ముందున్న పచ్చకారు ఇంకా వేరేకార్లు, పోలీస్‌వ్యాన్లు, జీపులువచ్చి ఆగినయ్....

ఏర్ కండీషన్‌గదిలో ఏవో మంతనాలుసాగాయి.

X X X X

పోలీస్‌స్టేషన్‌లోని ఫోను గణగణగణ మోగింది. "యెస్ యస్. ఐ ప్లీజ్" అన్నాడు యస్ ఐ గారు. అవతలిగొంతు వినగానే లేచినిలబడి ఫోనులోకి సెల్యూట్ చేసినట్లు వినబడేలాగ కాలును నేలకేసికొట్టి సెల్యూట్ చేసాడు.

"ఎంత వరకు వచ్చింది. కార్మికులు డ్యూటికిపోతున్నారా? లేదా?"; అవతలిగొంతు.

"లేదుసార్ ఈ రాడికల్స్‌ను అందరిని అరెస్టుచేస్తేగాని సమ్మె విరమింపబడేట్లు లేదుసార్, మేనేజిమెంటు యూనియన్లు 300 మంది పేర్లు యిచ్చినయిసార్, వారిని ఈ రోజురాత్రి పట్టుకోవాలనుకుంటున్నాం సార్"; అన్నాడు.

"సరే తొందరగా కానివ్వండి"; అని ఆర్డర్ ఇచ్చింది అవతలిగొంతు.

X X X X

చీకటిపడింది. కన్నుపొడుచుకున్నా కనపడని చిమ్మని చీకటి. ఆ చీకటిని చీల్చుకుంటు మిణుగురు పురుగుల్లాంటి కొంతమంది యువకులు ఓ గుడిసెలోకి చేరుకున్నారు.... వారురాగానే చాపలువేసింది ఆ ఇంటిఆవిడ.... గుడ్డిదీపం మధ్యలో ఓ డబ్బపీట పెట్టుకోని అందరు గుండ్రంగా కూర్చున్నారు. వారిలో చాలమంది యువకులే వారిముఖాల్లో ఏదోఆందోళన, ఉత్సాహం, పట్టుదల మిళితమైఉన్నట్టుగా కనపడుతున్నాయి.

854

"కామ్రేడ్ టైంలేదు మనం తొందరగా వెళ్లిపోవాలి మొదలుపెడ్తాం" అన్నాడు.

అందులో ఒక వ్యక్తి.... "కామ్రేడ్ ఈ మన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ట్రేడ్‌యూనియన్ నాయకులు, మేనేజిమెంటు, ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయి ఇన్ని రోజులు మాటతో మనల మోసపుచ్చి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూసారు. కాని ఈ దగుల్బాజి ట్రేడ్‌యూనియన్ నాయకులు మేనేజిమెంటుకు అమ్ముడుపోయే విధానాలను అర్థంచేసుకున్న కార్మికవర్గం అంతా వారి మోసాలకు తల ఒగ్గలేదు- అయితే ఇప్పుడు అరెస్టుల ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయాలని కుట్రలు పన్నుతున్నారు- ట్రేడ్‌యూనియన్ నాయకులు, మేనేజిమెంటు 300 మంది కార్మికుల పేర్లు పోలీసులకిచ్చారట, బహుశ ఈ రాత్రినుండి ఇండ్లమీద దాడులు మొదలుపెట్టవచ్చు- అయిన మనమంతా జాగ్రత్తగా ఉండి కార్మికులకు వీరికుట్రలను తెలుపుతూ సమ్మెను కొనసాగించాలి- మనందరం కార్మికులమే గనుక ఇంటింటికి తిరిగి కార్మికులనందరిని కలిసి చెప్పాలి." ఇలా చాల వివరాలు మాట్లాడుతున్నారు- వెళేముందు అందరూ ఒకరి నొకరు చెయ్యెత్తి పిడికిలి బిగించి ఎర్రెర్రదండాలు తెలుపుకొని ఒక్కొక్కరే చీకట్లో కలిసిపోయారు.

X X X X

పోలీస్ స్టేషన్‌లోఉన్న పాతగడియారం టన్- టన్- టన్-మని పన్నెండు సార్లు మోగింది.... రెండు వ్యాన్లనిండా పోలీసులు, తెల్లబట్టలువేసుకున్న వాడెవడో కూర్చుని ఉన్నారు.

"స్టార్ట్...." అన్నాడు సి.ఐ. ముందు జీపులో ఉన్న తెల్లబట్టలవాడు దారిచూపుతుండగా కదిలినయ్....

"ఇక్కడే సార్ రంగని ఇల్లు" అన్నాడు తెల్లబట్టల తొత్తుగాడు.

అన్నీఆగినవి- అందరుదిగి టక్- టక్-మని బూట్లచప్పుళ్ళతో ఒక గుడిసె చుట్టూ నిలబడ్డారు....

"రంగన్నా.... రంగన్నా" అని మార్చినగొంతుతో పిలిచాడో పోలీసు.

మళ్ళీపిలిచాడు-

"ఎవరు''అంది లోపలినుండి ఆడగొంతు.

''నేను ఆయనదోస్తును'' అన్నాడు అదేపోలీసు-

''లేదు'' అంది ఆమె

"ఎటుపోయిండు"....

"ఏమోతెలియదు"....

855

"తలుపులు తియ్యి"

"ఎందుకు? ఎవరునువ్వు?" ఆందోళనగా దాదాపు మొత్తుకున్నట్లుగా అంది.

"ఏయ్ మేము పోలీసోల్లము సర్కిల్‌సాబ్‌వచ్చిండు తలుపుతీయ్"

"ఓ అన్నయ్యా, ఓ అన్నయ్యా" పక్కింటికార్మికున్ని పిలిచింది.

"ఆఁ ఆఁ" అంటూ పక్కింటి కార్మికుడు లేచివచ్చాడు.

దాదాపు చుట్టు పక్కల ఇండ్లల్లోఉన్న కార్మికులు, స్త్రీలు లేచి ఒక్కొక్కరు బయటికి వస్తున్నారు.

"ఎవరయ్యా" అంటు ఓ కార్మికుడు వచ్చిండు.

"ఏయ్ నువ్ ఏ బాయికి పనిచేత్తనవ్" యస్. ఐ.

"కెకె2 సార్" కార్మికుడు జవాబు

"రంగన్న ఏడి"; యస్. ఐ

"ఏమో"; కార్మికుడు.

"ఆమెను తలుపు తీయమను"; యస్. ఐ

"తలుపట తీయక్కా"; కార్మికుడు.

"ఎందుకట ఇంట్ల ఎవరు లేరు" ఇంటామె.

"ఏయ్ తలుపుతియ్" అని ఒక్కతన్ను తన్నాడు తలుపును యస్. ఐ.

తలుపు తెరుచుకుంది.... ఇల్లంతా గాలించారు ఇంట్లో ఎవరూ మొగవాళ్లు లేక పోయేసరికి ఏవేవో బూతులు తిట్టిండ్లు....

"అరేయ్ వాన్ని బట్టుకోండి వాందికూడ కెకె2 బాయేనట"; అన్నాడు సర్కిల్ ఇనస్పెక్టర్.

కార్మికుడు ఉరుకపోయాడు కాని వీపుమీదపడ్డ లాఠీదెబ్బకు అమ్మా అన్నాడు.... అంతే వ్యాన్లో ఎక్కించారు.

ఇలా రాత్రింతా కార్మిక వాడల మీద దాడులు జరిగాయి.... బూతులు.... దెబ్బలు.... అరెస్టులు.... ఊరు ఊరంతా లేచింది....కార్మికులతిట్లు, స్త్రీల శాపనార్థాలు.

అంతా.... గజ దొంగల ముఠా ఊరిమీదపడి దోసుకు పోయినట్లుగా ఉంది.

తెల్లవారకముందే బావులమీద, గోడలమీద, ఊరంతా తెల్లని పేపర్లమీద ఎర్రటి అక్షరాలున్న పోస్టర్లు అతికించబడ్డాయి.

"మేనేజిమెంటు, ట్రేడ్‌యూనియన్ నాయకుల కుట్ర ఫలితంగా 20 మంది కార్మికుల అరెస్టు"

856

"పోలీసుల దౌర్జన్యం నశించాలి"

"అరెస్టుచేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలి." అని వ్రాసిఉంది.